# 18000 కన్నా కిందకు వస్తే దిద్దుబాటు

**సమీక్ష:** ప్రారంభంలో మార్కెట్ కోలుకోవచ్చున్న సంకేతాలు కనిపించినా చివరకు మాత్రం నష్టాలతోనే ముగిసింది. ప్రధాన కంపెనీల ఆర్థిక ఫలితాలు భేషుగ్గా ఉండడంతో గతవారం మార్కెట్ లాభాలతోనే ప్రారంభమైంది. ఆ తర్వాత మార్కెట్లకు విక్రయాల ఒత్తిడి ఎదురైంది. అంచనాల మేరకే ఆర్‌బీఐ కీలక రేట్లనే పెంచినప్పటికీ.. అది ప్రస్తుత ఆర్థిక సంవత్సర ద్రవ్యోల్బణ అంచనాలను శాతానికి పెంచడం; మరో పక్క ఆహార ద్రవ్యోల్బణ గణాంకాలు పెరగడం మదుపర్ల సెంటిమెంటును దెబ్బతీసింది. విక్రయాలను పెంచింది. తాజా కొనుగోళ్లు లేకపోవడం; విదేశీ సంస్థాగత మదుపుదార్లు(ఎఫ్ఐఐ) విక్రయాలను కొనసాగించడంతో పాటు ఎఫ్&ఓ గడువు చివరి తేదీ కావడంతో మరిన్ని నష్టాలు వచ్చాయి. వారాంతానికి సెన్సెక్స్ 18700 కీలక స్థాయి దిగువన 18396 వద్ద స్థిరపడింది. మొత్తం మీద 612 పాయింట్లు పతనమైంది.

**ఎఫ్ఐఐ/ఫండ్‌ల తీరు:** వరుసగా మూడో వారమూ ఎఫ్ఐఐలు రూ.737 కోట్ల నికర విక్రయాలు జరిపారు. మరో పక్క ఫండ్లు రూ.25 కోట్ల మేర నికర అమ్మకాలు జరిపాయి. లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 1:5గా నమోదవడం చూస్తే బలహీనతలు తీవ్రతరమయ్యాయని.. ముఖ్యంగా మధ్య, చిన్న విలువ షేర్లలో భారీ విక్రయాలు జరిగాయని అర్థమవుతోంది.

**ఈ వారంపై అంచనాలు:** అంతక్రితం చెప్పినట్లు మార్కెట్ మధ్యకాలిక దిద్దుబాటులోకి అడుగుపెట్టింది. 18000 స్థాయి దిశగా మరింత పతనమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. గతవారం మార్కెట్ కీలక 200 రోజుల చలన సగటు(డీఎమ్‌ఏ) కంటే దిగువన స్థిరపడింది. ఇది మార్కెట్లు ఈ వారంలో ఒత్తిడికి గురవుతాయన్న సంకేతాలనిస్తోంది. ప్రస్తుతం 200 డీఎమ్‌ఏ అయిన 18726 ఎలాంటి రికవరీకయినా కీలక నిరోధంగా పనిచేయగలదు. ఎఫ్ఐఐలు వరుసగా మూడు వారాలు విక్రయించడం చూస్తే ఇది మార్కెట్‌ను మరింత బలహీనం చేయగలదని అంచనా.

**ప్రభావితం చేసే అంశాలు:** నెలవారీ వాహన విక్రయాలు, సిమెంటు ఉత్పత్తి గణాంకాలు, టెలికాం వినియోగదారు గణాంకాలు, ఆర్థిక ఫలితాలు .. ఎంపిక చేసిన స్క్రిప్‌లను ప్రభావితం చేయొచ్చు. మూడో తేదీన విడుదలయ్యే ద్రవ్యోల్బణ గణాంకాలు కీలకం కానున్నాయి. ఈజిప్టులో పరిణామాలు మరింత అనిశ్చితి దిశగా పయనిస్తే ముడి చమురు ధరలు పెరిగి మరిన్ని బలహీనతలను మోసుకొచ్చే ప్రమాదముంది.

**తక్షణ నిరోధ స్థాయిలు:** 18540, 18726, 18949;

**తక్షణ మద్దతు స్థాయిలు:** 18027, 17820, 17447

**18000 తక్షణ స్వల్ప కాల మద్దతు స్థాయిగా ఉంటుంది. దీని కంటే దిగువన మార్కెట్ ముగిస్తే మరింత బలహీనతలను అంచనా వేయొచ్చు.**

*–సతీశ్ కంతేటి, జెన్ మనీ*

